


కమాన్ చౌరస్తాలో నమస్కారం చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



కేంద్రమంత్రి సంజయ్‌కి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు, గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, శ్రేణులు

పుడమితల్లికి ప్రణమిల్లి..

- కేంద్రమంత్రిగా తొలిసారి కరీంనగర్ చేరుకున్న బండి సంజయ్
- అడుగడుగునా బీజేపీ కార్యకర్తల అభిమానం
- ఘన స్వాగతం పలికిన శ్రేణులు

భగత్‌నగర్, జూన్ 19: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఎంపీ బండి సంజయ్‌కుమార్ బుధవారం తొలిసారి కరీంనగర్‌కు చేరుకున్నారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి కరీంనగర్ వచ్చిన ఆయనకు నగరంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి గజమాలతో సత్కరించారు. మంగళహారతులు, పూల మాలలతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. కరీంనగర్ కమాన్ చౌరస్తాలో పుడమి తల్లికి ప్రణమిల్లి, తెలంగాణ, కరీంనగర్ ప్రజలకు సాష్టంగా నమస్కారంతో పాదాభివందనం చేసి భారీ ర్యాలీతో తరలివెళ్లారు. భారీ క్రేన్‌లతో గజమాలలు, పూల వర్షంతో కార్యకర్తలు, నాయకులు తమ అభిమానం చాటుకున్నారు. జై బీజేపీ, జైజై నరేంద్రమోదీ భారత్ మాతాకీ జై అంటు నినదిచారు. గీతాభవన్ చౌరస్తాలో బండి సంజయ్‌కు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలి వచ్చి స్వాగతం పలికారు. ముస్లీం నాయకులు బండి సంజయ్‌కుమార్‌ను గజమాలతో సత్కరించారు. కోర్టు చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికిపూల మాల వేసి నివాలులర్పించారు. చైతన్యపురిలోని అమ్మవారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారులు వేద మంత్రోచ్చారణతో సంజయ్‌కు ఆశీర్వాదం అందించారు. అనంతరం ఇంట్లో సతీమణి హారతి పట్టగా కుటుంబీకులు ఘన స్వాగతం పలికారు. అమ్మ ఆశీస్సులు తీసుకుని, తననుకలిసేందుకు వచ్చిన కార్యకర్తలు నాయకులతో మాట్లాడారు.

పోలీసుల గౌరవ వందనం

భగత్‌నగర్ : కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు ఆర్అండ్‌బి అతిథి గృహంలో పోలీసులు గౌరవ వందనం సమర్పిం చారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, నగర ఏసీపీ నరేందర్, ఉన్నతాధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

కేంద్ర మంత్రి పదవి ప్రజలు, కార్యకర్తల భిక్ష

- రాష్ట్రాభివృద్ధికి, కరీంనగర్‌కు అధిక నిధులు తెచ్చేందుకు కృషి
- లాఠీదెబ్బలు, కేసులు, జైళ్లతోనే నాకీ గుర్తింపు

భగత్‌నగర్ : కేంద్ర మంత్రి పదవి కరీంనగర్ ప్రజలు, బీజేపీ కార్యకర్తల భిక్ష అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ అన్నారు. మహాశక్తి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం విలేకులతో మాట్లాడారు. కేసీఆర్ మూర్ఖపుపాలనపై పోరాడితే నాతోపాటు, కార్యకర్తలు లాఠీ దెబ్బలు తిని, జైళ్లకు వెళ్లారన్నారు. ప్రజా సంగ్రామ యాత్రలో నాతో కలిసి కష్టాలను లెక్క చేయకుండా 155రోజుల పాటు 1600 కిలోమీటర్లు పాదయాత్ర చేపట్టారన్నారు. పార్టీ బలోపేతం కోసం ప్రతి కార్యకర్త కష్టపడ్డారన్నారు. కార్యకర్తలు పడ్డ శ్రమతోనే ఈ రోజు నాకు కేంద్ర మంత్రి పదవి వచ్చిందన్నారు. కరీంనగర్ ప్రజలు, కార్యకర్తలకే ఈ పదవిని అంకితమిస్తున్నానన్నారు. కరీంనగర్ ప్రజలకు తెలంగాణ రాష్ట్రానికి సెల్యూట్ చేస్తున్నానన్నారు. కార్పొరేటర్ నుంచి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఎదిగానంటే ఇది కేవలం బీజేపీ వల్లే సాధ్యమయిందన్నారు. కేంద్ర మంత్రి పదవి అధికారం కోసమో, పదవులు అనుభవించడానికో అక్రమంగా సంపాదించుకోవడానికో కాదని, దేశరక్షణ, ధర్మరక్షణ, సమాజ సంఘటితం కోసం తెలంగాణ అభివృద్ధే లక్ష్యంగా పనిచేయడం కోసం ఉపయోగిస్తానన్నారు. రాజకీయాలకతీతంగా కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధి కోసం పదవిని ఉపయోగిస్తానన్నారు. మోదీ, అమిత్ షా ఆదేశాల మేరకు పనిచేస్తానన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత పూర్తిగా తెలంగాణ అభివృద్ధి,కరీంనగర్ అభివృద్ధి కోసమే పనిచేస్తానన్నారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ శాసన సభ్యురాలు బొడిగె శోభ, మాజీ మేయర్ డి శంకర్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి సంజయ్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ పమేలా సత్పతి



కేంద్ర మంత్రి సంజయ్‌కి గార్డ్ఆఫ్ హానర్ చేస్తున్న పోలీసులు



తల్లి ఆశీస్సులు తీసుకుంటున్న కేంద్ర మంత్రి

పండిట్, పీఈటీల కల సాకారం

- ఏళ్ల తరబడి నిరీక్షణ తర్వాత పదోన్నతులు
- కొత్త పాఠశాలల్లో చేరిన ఉపాధ్యాయులు



కరీంనగర్ టౌన్, జూన్ 19: లాంగ్వేజ్ పండితులు, పీఈటీల కల సాకారమైంది. అనేక సంవత్సరాలుగా ఎస్‌జీటీ కేడర్‌లో పనిచేస్తున్న వీరు అర్హత కలిగి ఉన్నప్పటికీ పదోన్నతులు కల్పించక పోవడంతో ఇన్నాళ్లు వేచి చూశారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎల్‌పీ, పీఈటీలకు పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టింది. దాదాపు ఏడు సంవత్సరాల తర్వాత ఈ ప్రక్రియ చేపట్టగా కొంత మంది కోర్టును ఆశ్రయించడంతో మళ్లీ పదోన్నతులకు బ్రేక్ పడుతుందనే వార్తలు రావడంతో ఆందోళన చెందారు. అయితే పదోన్నతులు పొందిన ఎల్‌పీ, పీఈటీలకు బుధవారం ఉదయం జిల్లా విద్యాశాఖ అధికారి సిహెచ్ వీఎస్ జనార్ధన్‌రావు పదోన్నతులతో పాటు బదిలీ ఉత్తర్వులు అందించారు. ఈ నెల 7న బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను విడుదల చేసింది. దీనితో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 957 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లు (ఎస్‌జీటీ), 170 మంది భాషా పండితులు (ఎల్‌పీ), 62 మంది పీఈటీలు విధులు నిర్వహిస్తుండగా వీరిలో అర్హులైన వారు పదోన్నతులను పొందే అవకాశం లభించింది. అలాగే బదిలీలకు కూడా అవకాశమివ్వడంతో జిల్లాలో చాలా మంది వారికి అనుకూలమైన పాఠశాలలకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకునే అవకాశం దక్కింది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు సంబందించిన ఉత్తర్వులను ప్రభుత్వం విడుదల చేయడంతో ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ నెల 10 నుంచి బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభం కాగా, ఆన్‌లైన్‌లో దరఖాస్తులను పరిశీలించిన విద్యాశాఖ జాబితాను విడుదల చేసి బుధవారం ఉదయం పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు ఉత్తర్వులను అందజేశారు.

పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకోవాలి

- జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ సరస్వతి
- కరదీపికపై అంగన్‌వాడీలకు శిక్షణ



శిక్షణకు హాజరైన అంగన్‌వాడీ టీచర్‌లు

కరీంనగర్ రూరల్, జూన్19: అంగన్‌వాడీ టీచర్లు పిల్లల మానసిక స్థితిని అర్థం చేసుకుని బోధించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా వెల్ఫేర్ ఆఫీసర్ సరస్వతి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కరీంనగర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ కరీంనగర్ అర్బన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో సవరించిన పాఠ్యాంశాలపై అంగన్‌వాడీ టీచర్లకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల విద్యాభివృద్ధికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. చిన్నారులు ఎలా విద్య నేర్చుకుంటారో తెలుసుకోవాలని సూచించారు. పిల్లల మేథస్సు పెంచేలా విద్యాబోధన చేయాలని తెలిపారు. అనంతరం సీడీపీఓ, మాస్టర్ ట్రైనర్ లక్ష్మీనారాయణ సవరించిన పాఠ్యాంశాలు, బోధనా విధానాలపై అవగాహన కల్పించారు. అనంతరం నూతన పాఠ్యాంశ పుస్తకాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు నిర్మల, అరుణ, విజయ, స్వప్న, రాజేశ్వరి, రోమిళ, సతీష్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

దరఖాస్తులకే 'ప్రజా పాలన' పరిమితం

- అర్హులకు అందని పథకాలు
- లబ్ధిదారుల ఎదురు చూపులు



కరీంనగర్ మండల పరిషత్‌లో ప్రజాపాలన దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు(ఫైల్)

కరీంనగర్ రూరల్, జూన్ 19: ఎన్నికల కోడ్ ముగిసింది. గతంలో నిర్వహించిన ప్రజా పాలన కార్య క్రమంలో తాము చేసుకున్న దరఖా స్తులకు మోక్షం లభించి సంక్షేమ పథ కాలు తమ అందుతాయని ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగిలింది. వందలాది మంది లబ్ధిదారులు కార్యాలయాల చట్టు తిరుగుతూ తమకు పథ కాలను వర్తింపజేయాలని అధికారులను కోరుతు న్నారు. కరీంనగర్‌రూరల్ మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలన ప్రారంభంలో 14,200 మంది వివిధ పథకాల కోసం దరఖాస్తులను అందజేశారు. ఇందులో కొంత మందికి మాత్రమే ఫిబ్రవరి, మార్చి మొదటి వారంలో పథకాలు అందాయి. 200 యూనిట్ల ఉచిత విద్యుతోపాటు 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ పథకాలకు పలువురికి వర్తింపజేశారు. మిగతా మందికి రాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రజాపాలన ఫిబ్రవరిలో ప్రారంభం కాగా తెల్లరేషన్ కార్డులు ఉన్న వారందరూ దరఖాస్తులు చేసుకున్నారు. కొంతమంది లబ్ధిదారులకు మంజూరు కాగా చాలా మందికి పథకం వర్తించలేదు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కోడ్ అమల్లోకి రావడంతో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ నిలిచిపోయింది. ఎన్నికల కోడ్ ఈనెల 6న ముగియడంతో మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తారని లబ్ధిదారులు బావించారు. దరఖాస్తులు తీసుకోకపోవడంతో ఆందోళన చెందారు. గతంలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే సవరణకు అవకాశం ఇచ్చారు. సరిగా దరఖాస్తు చేసుకోని లబ్ధిదారులు, ప్రజాపాలన పథకాల్లో ఆప్షన్లు ఇవ్వని వారు గ్యాస్, కరెంటు బిల్లులు, రేషన్ కార్డులు, ఆదార్ కార్డు జిరాక్స్‌లతో మళ్లీ దరఖాస్తు చేసుకోవడానికి కార్యాలయాలకు వెళుతున్నారు. కానీ కొందరు ఆప్షన్స్ ఇవ్వని వారికి మాత్రమే ప్రజాపాలన సైట్‌లో అప్‌లోడ్ అవుతుండగా ఆప్షన్ ఇచ్చిన వారి వివరాలు చూపించడం లేదు. కరీంనగర్ మండల పరిషత్‌లో ప్రజాపాలన దరఖాస్తులకు తిరిగి అప్‌లోడ్ చేసుకోవడానికి బారులు తీరుతున్నారు. మండలంలో ఇంకా లబ్ధి పొందని వారు మిగిలే ఉండగా వారికి అవగాహన లోపంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. ప్రభుత్వం స్పందించి ప్రజాపాలన దరఖాస్తులకు మళ్లీ అవకాశం ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

భూముల మార్కెట్ విలువపై అధ్యయనం

- ఆగస్టు 1నుంచి అమల్లోకి నూతన చార్జీలు
- గ్రామాల్లో రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల సర్వే



హుజూరాబాద్, జూన్ 19: రాష్ట్ర ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖల ద్వారా ఆదాయం పెంచుకోవాలని భూముల మార్కెట్ విలువ పెంపుపై అధ్యయనం చేస్తున్నారు. దీంతో భూముల మార్కెట్ విలువ కొంత మేర పెరగనున్నట్లు తెలిసింది. వాస్తవ విలువలకు, రిజిస్ట్రేషన్ల విలువలకు వ్యత్యాసం ఉందనే ఉద్దేశ్యంతో రిజిస్ట్రేషన్ల విలువలు ఇటీవల పెంచేందుకు సిద్ధమైంది. వచ్చే ఆగస్టు 1 నుంచి కొత్త మార్కెట్ విలువలకు అనుగుణంగా భూముల ధరలు పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా నాలుగు రోజులుగా రెవెన్యూ, స్టాంపుల రిజిస్ట్రేషన్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో తిరుగుతూ భూముల ధరలను రైతులను వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. 20నుంచి 30శాతం రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇందు కోసమే భూ విలువల సవరణ ప్రక్రియ మొదలు పెట్టారు. దాదాపు 20 రోజుల పాటు ఈ ప్రక్రియ కొనసాగనుంది. గ్రామాల్లో వ్యవసాయేతర భూములు, రహదారులకు ఆనుకుని ఉన్న గ్రామాలను గుర్తించి భూముల విలువలను పెంచాలని చూస్తున్నారు. రెవెన్యూ మ్యాప్‌లను తీసుకొని విచారిస్తున్నారు. ఇంటి స్థలాలుగా మారే సర్వే నంబర్లు, జాతీయ, రాష్ట్ర రహదారులకు అనుకుని ఉన్న సర్వే నంబర్లను వేర్వేరుగా గుర్తించనున్నారు. సబ్ రిజిస్ట్రార్ ఆయా గ్రామాలకు వెళ్లి ప్రత్యేకంగా సమాచారం సేకరిస్తున్నారు. ఆయా గ్రామాల్లోని రెవెన్యూ, పంచాయతీ అధికారులు రైతులతో మాట్లాడి ప్రస్తుత బహిరంగ మార్కెట్లో ఉన్న ధరలను అడిగి తెలుసుకుంటున్నారు. పట్టణానికి 5నుంచి 6 కిలో మీటర్లకు దగ్గరగా ఉండే గ్రామాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మున్సిపాలిటీల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న వాణిజ్య, నివాసం ఉండే ప్రాంతాలను వేర్వేరుగా భూముల విలువను నిర్ధారించనున్నారు. 2021లో కేసీఆర్ ప్రభుత్వం భూముల ధరలను పెంచింది. దీంతో రియల్ ఎస్టేట్ రంగంపై దెబ్బ పడింది. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న దశలో మరోసారి భూముల ధరలు పెరిగితే ప్రజలపై పెనుభారం పడనుందని పలువురు అంటున్నారు.

● భూముల విలువల సవరణ ప్రారంభించాం

- జావిద్, సబ్ రిజిస్ట్రార్, హుజూరాబాద్

భూముల విలువల సవరణ ప్రక్రియ మొదలు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. దీంతో గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో వివరాలు సేకరిస్తున్నాం. పూర్తి నివేదికను 15రోజుల్లో ప్రభుత్వానికి అందజేస్తాం.

దొంగలు బాబోయ్..

సతీష్.. కరీంనగర్ మార్కెట్‌లో కూరగాయలు కొనేందుకు వెళ్లాడు. అంతకు ముందే కుటుంబసభ్యులతో తన ఐఫోన్‌లో మాట్లాడి జేబులో పెట్టుకున్నాడు. కూరగాయలు తీసుకునేందుకు వంగినప్పుడు ఎవరో నెట్టివేశారు. తేరుకుని జేబులో చూసే సరికి ఐఫోన్ మాయం. లక్ష రూపాయల ఫోన్ మాయమయ్యేసరికి ఆందోళన చెందాడు. పక్కనున్న వ్యక్తుల ఫోన్ తీసుకుని తన నంబర్‌కు కాల్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చింది.

మధు.. వరంగల్ వెళ్లేందుకు కరీంనగర్ బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు ఎక్కే సమయంలో ఇద్దరు వ్యక్తులు నెట్టుకుంటూ బస్సు దిగారు. మధు బస్సెక్కిన తర్వాత జేబులో చూసుకుంటే 50 వేల విలువైన ఫోన్ కనిపించలేదు..

- వందల సంఖ్యలో విలువైన సెల్‌ఫోన్ల చోరీ
- ఫోన్లను విడదీసి విడి భాగాలను అమ్ముతున్న అంతర్రాష్ట్ర ముఠా
- సీఈఐఆర్ పోర్టల్‌కు వెయ్యికిపైగా దరఖాస్తులు

కరీంనగర్ క్రైం, జూన్ 19: ఇలా కరీంనగర్‌లో కూరగాయల మార్కెట్, టవర్ సర్కిల్, రాజీవ్‌చౌక్, బస్టాండ్‌లో రోజూ విలువైన సెల్‌ఫోన్లు చోరీకి గురవుతున్నాయి. బాధితులు వెంటనే సెల్‌ఫోన్ చోరీలపై సంబంధిత పోలీసు ఠాణాలు, సీఇఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేస్తున్నప్పటికీ ఫలితం లేకుండా పోతున్నది. మాయమైన ఫోన్లకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రాక్ చేస్తున్నారు. అవి పశ్చిమబెంగాల్‌లో, జార్ఖండ్‌లో ఉన్నట్లుగా లొకేషన్ చూపిస్తున్నది. అంతదూరం వెళ్లి ఫోన్ రికవరీ చేసుకోలేక వదిలేసుకుంటున్నారు.

● చిన్న పిల్లల చేత చోరీలు

ఈ సెల్‌ఫోన్ల చోరీలు అంతర్రాష్ట్ర ముఠాలపనిగా పోలీసులు చెబుతున్నారు. ముఖ్యంగా జార్ఖండ్ రాష్ట్రంలోని పలు ముఠాలు చిన్న పిల్లల చేత సెల్‌ఫోన్లను చోరీ చేయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. జార్ఖండ్‌కు చెందిన అంతరాష్ట్ర దొంగల ముఠాలు అక్కడ స్థానిక పేద వర్గాలకు చెందిన పిల్లలను పనికోసమంటూ నెలకు జీతం మాదిరిగా తల్లిదండ్రులతో ఒప్పందం కుదుర్చుకుంటున్నాయి. 10 మందితో ఒక ముఠా ఏర్పాటు చేసి రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఆ పిల్లల చేత సెల్‌ఫోన్‌లు చోరీ చేయిస్తున్నాయి. వాటిని పశ్చిమబెంగాల్, నేపాల్‌లో విక్రయిస్తున్నాయి. కమిషనరేట్ వ్యాప్తంగా 2024లో ఇప్పటి వరకు సెల్‌ఫోన్ చోరీకి గురైన వెయ్యిమందికి పైగా బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 300కుపైగా సెల్‌ఫోన్‌లను పోలీసులు రికవరీ చేసి బాధితులు అప్పగించారు. మరి కొన్ని ఫోన్‌ల లోకేషన్ కోసం ట్రాకింగ్ చేస్తుండగా కొన్ని ఫోన్ల లోకేషన్ రావడంలేదని తెలుస్తోంది. ఈ ఫోన్‌ల విడిబాగాలు విక్రయించారని అనుమానం.




● విడతల వారీగా.. చేతులు మారుతూ

కూరగాయలు, ఇతర మార్కెట్‌లలో రద్దీ సమయాల్లో ఈ ముఠాకు చెందిన పిల్లలు వెళ్లి కూరగాయాలు కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ పేపర్ అడ్డుగా పెట్టి షర్ట్, ప్యాంట్ జేబుల్లో, హ్యాండ్‌బ్యాగ్‌ల్లో ఉన్న ఫోన్‌లను చోరీ చేస్తున్నారు. ఒక ఫోన్ చోరీ ఘటనలో నలుగురైదుగురు పిల్లలు చెయిన్‌లాగా పనిచేస్తుంటారు. సెల్ ఫోన్‌ను జేబులో నుంచి చోరీచేసిన బాలుడు అక్కడే ఉన్నన రెండో బాలుడికి ఇస్తాడు. ఆ బాలుడు మరొకరికి, అతడు మరొకరికి ఇస్తారు. ఇలా చోరీ చేసిన ఫోన్లను ముఠా నాయకుడికి చేర్చుతారు. దీంతో సెల్‌ఫోన్ ఫోన్ పోగొట్టుకున్నవారు అక్కడ ఉన్న వారిని తనిఖీ చేసినా అది దొరకదు. చోరీ అయిన ఫోన్ నిమిషాల్లో దూరంగా ముఠా నాయకుడికి చేరుతుంది. ఇలా చోరీ చేసిన ఫోన్లను జార్ఖండ్‌కు తరలిస్తాడు. సెల్‌ఫోన్ చోరీ చేస్తూ పోలీసులకు చిక్కినా నిందితులు మైనర్లు ఒకాబట్టి చట్ట ప్రకారం వారిపై కేసులు పెట్టకుండా జువైనల్‌హోంకు తరలించి కొద్ది రోజులకు వదిలేయాల్సి వస్తోంది. దీంతో వారిలో భయంలేకుండా పోతున్నదని పోలీసువర్గాలు చెబుతున్నాయి.













నీటి సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

కరీంనగర్ టౌన్, జూన్ 19: వంద ఎకరాల ఆయకట్టు ఉన్న నీటి సంఘాల కు గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎన్నికలు నిర్వహించగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించలేదని నీటి సంఘాల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బీరెడ్డి కరుణాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1997లో టీడీపీ ప్రభుత్వం నీటి సంఘాలను ఏర్పాటు చేసి రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించారన్నారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కాలపరిమితిని మూడేళ్లకు పెంచిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం లోకి వచ్చినందున నీటి సంఘాలకు వెంటనే ఎన్నికలు నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

గోపాల్‌రావుపేటలో ఏసీపీ విచారణ

రామడగు, జూన్ 19: రామడుగు మండలం గోపాల్‌రావుపేటలో ఏసీపీ విచారణ చేపట్టారు. ఈసందర్భంగా బుడగ జంగాల యువకులను కులం పేరుతో గౌడ కులస్తులు దూషించారని ఫిర్యాదు చేయడంతో ఏసీపీ విచారణ జరిపారు. ఆయన వెంట రామడుగు ఎస్ఐ సురేందర్, తదితరులు ఉన్నారు.



హత్య కేసులో నిందితుల అరెస్టు


నిందితుల అరెస్ట్ చూపుతున్న సీఐ సురేష్ బాబు

కోరుట్ల, జూన్ 19: కోరుట్ల మండలం మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన కోట రాజేష్ హత్య కేసులో ఎనిమిది మంది నిదుతులను అరెస్టు చేసినట్లు కోరుట్ల సీఐ సురుష్ బాబు బుధవారం తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కేసు సంబదించిన వివరాలను సీఐ సురేష్ బాబు, ఎస్ఐ కిరణ్ కుమార్‌తో వెల్లిడించారు. రాజేష్ తన తమ్ముడు రాకేష్‌తో పాటు కుటంబ సభ్యులకు గ్రామంలో అస్తి తగాద ఉంది. రాజేష్ వివాదంలో ఉన్న భూమిలో కొన్ని రోజుల క్రితం బాత్ రూంలు కట్టడంతో మరింత వివాదం ముదిరింది. విషయంపై కుటుంబసభ్యులు, తమ్ముడు రాకేష్ తన మిత్రుడు లింగపల్లి నరేష్ రాజేష్‌ను ప్రశ్నించారు. దీంతో ఘర్షణ చోటుచేసుకోగా రాజేష్‌పై తమ్ముడు రాకేష్ కత్తితోదాడి చేశారు. అలాగే స్నేహితుడు లింగంపల్లి నరేష్ తండ్రి గంగారాజం, భార్య కోట మాసన, అతని చిన్నమ్మలు కోట మల్లు, మంచాల లక్ష్మి, బాబాయిలు కోట గంగారాజం, మాంచాల రాజేశం దాడి చేసినట్లు గుర్తించి రాజేష్ భార్య లాస్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. నిందితులు మోహరావుపేట, మేడిపల్లి మండలం వల్లంపల్లి గ్రామాల్లో ఉన్నట్లు సమాచా రం అందగా అక్కడి వెళ్లి వారిని కోరుట్ల ఎస్ఐ కిరణ్‌కుమార్ అరెస్టు చేసి కోరుట్ల పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినుట్ల సీఐ తెలిపారు. కేసులో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని సీఐ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సారంగాపూర్, జూన్ 19: అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరు యజమాని, డ్రైవర్‌పై పోలీసులు బుధవారం కేసు నమోదు చేసి ట్రాక్టరును సీజ్ చేశారు. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల ప్రకారం ఆరెపల్లి నుంచి జగిత్యాలకు అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా సారంగాపూర్ అటవీ ప్రాంతంలో పోలీసులు పట్టుకుని ట్రాక్టరును స్టేషన్‌కు తరలించి సీజ్ చేశారు. ఆరెపల్లికి చెందిన దర్శనాల సిద్దు, పిస్క వెంకటేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.


విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలి


సమావుశంలో మాట్లాడుతున్న మణికంఠరెడ్డి

జమ్మికుంట రూరల్, జూన్ 19: రాష్ట్రంలో ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కారించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాల బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థులకు అండగా ఉండాలని అన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు ఫీజుల దోపిడీ చేస్తున్నాయని మండిపడ్డారు. నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని నీట్ పరీక్ష రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రామరావు వెంకటేష్, నాయకులు అలువాల విష్ణు, అనిల్ కుమార్, తౌకిర్ అనిల్ రెడ్డి, సాయి, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.







డంపింగ్‌యార్డు పొగతో ఇక్కట్లు


మెట్‌పల్లిలోని డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ

ఉక్కిరిబిక్కిరి అవుతున్న రైతులు

మెట్‌పల్లి, జూన్ 19: మెట్‌పల్లి పాలక సంఘం పరిధిలోని పట్టణ శివారు డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగలతో జనం తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పట్టణం శివారులోని గోదూరు రోడ్డులోని డంపింగ్‌యార్డుతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతు న్నారు. డంపింగ్‌కు సమీపంలోని వ్యవసాయ పొలాలలో పనిచేసే రైతులుకు కుళ్లిపోయిన చెత్తతో దుర్వాసన వెదజల్లుతోందంటున్నారు. డంపింగ్ యార్డులోని చెత్తకు సిబ్బంది మంట పెట్టి వెళ్లిపోతున్నారు. దీంతో అక్కడ అప్పుడప్పుడు మంటలు ఎగిసిపడుతున్నాయి. పలుమార్లు సిబ్బందికి సూచించినా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గాలి ఎక్కువగా వీస్తున్న సమయంలో ఈ దట్టమైన పొగలు ఆప్రాంతమంతా కమ్ముకొని పొలాల్లో పని చేసే రైతులు, కూలీలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంట పొలాలకు దగ్గర డంపింగ్ యార్డు ఏర్పాటు చేసిన దానిలో రోజు పట్టణంలో సేకరించిన చెత్తను అక్కడ వేయడం వలన పొలాల్లో పని చేసే రైతులకు దుర్వాసన వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పొలాలకు వెళ్లే రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఏమిచేయాలో తెలియక ప్రజలు, రైతులు మురికిలోనుంచి పొలాలకు వెళ్తున్నారు. బుధవారం డంపింగ్ యార్డుకు నిప్పంటించడంతో రైతులు, వాహనదారులు ఉక్కిరిబిక్కిరయ్యారు. చెత్తకు నిప్పంటిస్తుండడం తో ఆ ప్రాంతమం తా దట్టమైన పొగలు నిండుకుని సమీపంలోని రైతులు, వాహనదారులు పీల్చుకోవడం వల్ల దగ్గు, ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయంటున్నారు. సమస్యను మున్సిపల్ అధికారుల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మంటలు ఆర్పుతామంటారే కానీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు పరిశీలించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురు అదృశ్యం?

● లబోదిబోమంటున్న బాధితులు

హుజూరాబాద్, జూన్ 19: హుజూరాబాద్‌లో నెలరోజుల్లో ముగ్గురు వ్యక్తులు ఆర్థిక ఇబ్బందులతో అదృశ్యం కావడంతో డబ్బులు ఇచ్చిన బాధితులు లబోదిబోమంటున్నారు. హుజూరాబాద్ పట్టణంలో గత 20ఏళ్లుగా ఓ వ్యక్తి రాజకీయంలో ఉంటూ ఫైనాన్స్, చిట్టీల వ్యాపారం నిర్వహించాడు. ఇతనిని నమ్మిన కొంత మంది చిట్టీలు వేయగా, వడ్డీ వస్తుందనే ఉద్దేశ్యంతో దాచుకున్న డబ్బులను సుమారు రూ. కోటి వరకు ఇచ్చారు. ఆ వ్యక్తి ఇటీవల భార్య పిల్లలతో కనబడకుండా పోయాడు. ఇదిలా ఉండగా, పట్టణంలోని కర్నాటకు చెందిన ఓ బేకరి యజమాని కొంత మంది దగ్గర సుమారు రూ. 20లక్షల వరకు అప్పుచేసి కుటుంబంతో పారిపోయాడు. అతని కోసం బాధితులు కర్నాటకకు కూడా వెళ్లి వచ్చినట్లు సమాచారం. అలాగే పట్టణంలోని ఓ రిటైర్డ్ ఉద్యోగి కొడుకు వ్యాపారం చేసి అప్పులు కావడంతో, తెలుసుకున్న తండ్రి నెల రోజులుగా కనబడకుండా పోవడంతో కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పైముగ్గురు వ్యక్తులది ఆర్థిక వ్యవహారాల కారణం కావడంతో హుజూరాబాద్ పట్టణంలో చర్చనీయాంశంగా మారింది.

బీసీస్టడీ సర్కిల్‌లో గ్రూప్-2 అభ్యర్థులకు గ్రాండ్ టెస్టులు

గణేశ్‌నగర్,జూన్ 19: తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్ -2 గ్రాండ్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తిగల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్‌లో జూలై 5వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పరీక్షలు కరీంనగర్ బీసీ స్టడీ సర్కిల్‌లో జూలై 8,9,15,16,22,23,30,31, తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి 12:30 వరకు అలాగే, మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు టెస్టులను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 0878-2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

యువతకు ఉపాధి కల్పించే దిశగా ప్రత్యేక కార్యాచరణ

- మంథనిలో కోకోకోలా ప్లాంట్ - మినీ ఐటీ సెంటర్‌ను ఏర్పాటుకు కృషి - రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, జూన్19: మంథని నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడానికి మంథని ప్రాంతంలో కోకోకోలా కంపెనీ ప్లాంట్‌ను ఏర్పాటు చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బా బు వెల్లడించారు. స్థానిక జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత బాలుర పాఠశాలలో బుధవారం నిర్వహించిన బడిబాట ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ఆమెరికా పర్యటనలో కోకోకోలా కంపెనీ ప్రతినిధులను కలిసి రాష్ట్రంలో పరిశ్రమ స్థాపనకు ముందుకు రావాలని కోరగా వారు తమ ప్లాంట్‌ను మంథనిలో ఏర్పాటు చేయటానికి హామీ ఇచ్చారన్నారు. కోకోకోలా ప్లాంట్‌ను ఏర్పాటు చేయటానికి మంథని మండలంలోని అడవిసోమన్‌పల్లి, సిరిపురం తోపాటు పెద్దపల్లి జిల్లాలోని మరో రెండు ప్రాంతాలను కంపెనీ ప్రతినిధులు తమకు అనువైన స్థలం కోసం పరిశీలిస్తున్నారన్నారు. త్వరలోనే ప్లాంట్‌ను ఏర్పాటు చేయించి మంథని ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. మంథని-శివ్వారం మధ్య గోదావరినదిపై రూ. 120 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపడుతామన్నారు. మరో పదిహేను రోజుల్లో సంబంధిత శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో గోదావరినదిపై బ్రిడ్జి నిర్మాణం పనులకు శంకుస్థాపన చేయిస్తామన్నారు. బ్రిడ్జి నిర్మాణంతో మంచిర్యాల-పెద్దపల్లి జిల్లా అనుసంధానంతో ప్రజలకు రవాణా వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు. మంథనిలో ఒక చిన్న ఐటీ సంస్థ సైతం అతి త్వరలో ఏర్పాటు కాబోతుందని, తొలి విడితలో 50 మంది యువతకు నెలరోజుల లోపు ఉపాధి కల్పుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక అవసరాలు కల్పించే దిశగా ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకున్నామన్నారు. పాఠశాలల్లో చదివే ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటుందన్నారు. పెద్దపల్లి జిల్లాలో రూ.30 కోట్లతో 478 పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకోసం చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సాధికారత మాటలకే పరిమితం కాకుండా చేతలు కూడా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అందులో భాగంగా ఆర్టిసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం, మహిళా సంఘాల సభ్యులతో ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతుల కల్పన బాధ్యతలు అప్పగించామన్నారు.

మార్కెట్‌లో వచ్చే కొత్త కోర్సులు, ట్రెండ్స్ నైపుణ్యాలు విద్యార్థులకు అందించడం కోసం ఐటీఐలను ఆధునీకరిస్తున్నామన్నారు. 65 అడ్వాన్స్ లెర్నింగ్ కేంద్రాలను దాదాపు 2,234 కోట్ల రూపాయలతో టాటా కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. కాటారం ఐటీఐలో ఆరు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ఉత్తీర్ణత శాతాన్ని పెంచడానికి నాణ్యమైన విద్యను ఉపాధ్యాయుల ద్వారా అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జె అరుణశ్రీ, ఆర్డీవో హనుమానాయక్, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, జడ్పీటీసీ తగరం సుమలత, సింగిల్‌విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, డీఈవో మాధవి, డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్, పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, పీఈటీ డాక్టర్ దొమ్మటి రవి పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మేడిపల్లి, జూన్ 19: మండలంలోని దేశాపేట గ్రామానికి చెందిన కురుమళ్ల సతీష్(31) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సతీష్ కొద్దిరోజుల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. అయితే అక్కడ ఉపాధి లభించకపోవడంతో ఏం చేయాలో తెలియక మనోవేదనకు గురయ్యాడు. మరోవైపు గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు పెరిగిపోయాయి. అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్రమనస్తాపానికి గురైన సతీష్ జీవితంపై విరక్తి చెంది బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. సతీష్ భార్య ఫిర్యాదు మేరకు కేసుదర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యాంరాజ్ తెలిపారు.

బావిలో మహిళ మృతదేహం లభ్యం

సుల్తానాబాద్, జూన్ 19: సుల్తానాబాద్ మండలంలోని నీరుకుళ్ల గ్రామంలో నిర్మల(38) అనే మహిళ మృతదేహం బావిలో బుధవారం లభ్యమైంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. నీరుకుళ్ల గ్రామానికి చెందిన నిర్మలకు చాలాకాలం నుంచి సంతానం కలుగలేదు. దాంతో అమె మానసికంగా అవేదన చెందుతోంది. కొన్ని రోజుల క్రితం ఆపరేషన్ కూడా జరగడంతో ఇంకా మానసికంగా కుంగిపోయింది. బుధవారం ఉదయం నుంచి తన భార్య కనిపించకుండా పోవడంతో భర్త ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అంతటా వెతికారు. ఎక్కడా ఆచూకీ లభ్యం కాలేదు. మధ్యాహ్నం ఇంటి సమీపంలోని వ్యవసాయ బావిలో నిర్మల మృతదేహం లభ్యమైంది. నిర్మల మృతిపై బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రేపు సంగీత విభావరి

కరీంనగర్ కల్చరల్, జూన్ 19: ప్రపంచ సంగీత దినోత్సవం సందర్భంగా నగరంలోని ఫిలింభవన్‌లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవీణ్ సల్వాజి మ్యూజికల్ గ్రూప్, సల్వాజి ఈవెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 10 జిల్లాల కళాకారుల సంగీత విభావరి ఏర్పాటు చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సల్వాజి ప్రవీణ్ ఒక ప్రకటనలో తెలిపారు. సంగీత విద్వాంసులకు, గురువులకు సన్మానం ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందికి సన్మానం


ఆర్టీసీ సిబ్బందిని సన్మానిస్తున్న ఎండీ సజ్జనార్

భగత్‌నగర్, జూన్19: కరీంనగర్ బస్‌స్టేషన్‌లో మహిళకు పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బందిని బుధవారం హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్ సత్కరించారు. ఈనెల 16 ఆదివారం ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ఒడిశా రాష్ట్రానికి చెందిన గర్భిణీ కుమారికి పురిటి నొప్పులు రాగా ఆర్టీసీ సిబ్బంది బస్‌స్టేషన్‌లో పురుడు పోశారు. బస్‌స్టేషన్‌లో మహిళ ప్రసవానికి సహకరించి పురుడు పోసిన ఆర్టీసీ సిబ్బంది సైదమ్మ, రేణుక, భవాణి, లావణ్య, బస్‌స్టేషన్ ట్రాఫిక్‌మేనేజర్ రజనీకృష్ణ, స్టేషన్ మేనేజర్ నోముల అంజయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ వి రవీందర్, జాయింట్ డైరెక్టర్ (విజిలెన్స్) అపూర్వరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్) పివి మునిశేఖర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అడ్మినిస్ట్రేషన్) ఎస్‌కృష్ణకాంత్, చీఫ్ పర్సనల్ మేనేజర్ ఉషాదేవి తదితరులు పాల్గొన్నారు.

● **చిన్నారికి ఆర్టీసీ జీవితకాలపు ఉచిత బస్‌పాస్**

ఈనెల 16న ఆదివారం కరీంనగర్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బస్‌స్టేషన్‌లో జన్మించిన చిన్నారికి ఆర్టీసీ జీవితకాలపు ఉచిత బస్ పాస్‌ను సంస్థ ప్రకటించింది. గతంలో ఆర్టీసీ బస్సులు, బస్‌స్టేషన్‌లో పుట్టిన పిల్లలకు జీవితకాలపు ఉచిత బస్‌పాస్ ఇవ్వాలనే యాజమాన్యం తీసుకున్న నిర్ణయం మేరకు ఆదివారం కరీంనగర్ బస్‌స్టేషన్‌లో జన్మించిన ఆడపిల్లకు బర్త్‌డే గిఫ్ట్‌గా ఉచిత బస్‌పాస్‌ను మంజూరు చేస్తున్నట్లు సంస్థ యాజమాన్యం తెలిపింది.

జీపీఎఫ్ ఖాతాల్లోని నిధుల మాయంపై విచారణ


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

జగిత్యాల టౌన్, జూన్ 19 : జగిత్యాల జిల్లా వైద్య విధాన పరిషత్‌లో పనిచేసే ఉద్యోగుల జీపీఎఫ్ ఖాతాల్లోని నిధులు మాయంపై బుధవారం నిజామాబాద్ జిల్లా బాన్సువాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆసుపత్రి ఆవరణలో ఉన్న వైద్య విధాన పరిషత్ కార్యాలయంలో బుధవారం రోజంతా విచారణ కొనసాగింది. రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న యాసిన్ అనే ఉద్యోగి వైద్య విధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల డీఏ ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్, వివిధ డిడెక్షన్లకు సంబంధించిన నిధులను వారి ఖాతాల్లో జమ చేయకుండా సుమారు రూ.50 లక్షలకు పైగా పక్కదారి పట్టించగా విచారణలో నిజమని తేలడంతో యాసిన్‌ను సస్పెండ్ చేశారు. దీంతో బుధవారం బాన్సువాడ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్ ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. వైద్య విధాన పరిషత్ ఖాతాకు సంబంధించి జారీ చేసిన ఓచర్లు, చెక్కులు తదితర రికార్డులను హైదరాబాద్ నుంచి వచ్చిన ఇద్దరు ఆడిటర్స్ పరిశీలించారు. యాసిన్ మూడు చెక్కులకు సంబంధించిన ఓచర్లను మాయం చేసినట్లు గుర్తించారు. దారి మళ్లించిన నిధుల నుంచి రూ. 40 లక్షలను ఖాతాలోకి జమ చేయించారు. మిగతా నిధులు రికవరితో పాటు రెండు, మూడు సంవత్సరాల లావాదేవీలకు సంబంధించిన ఓచర్లను ఆడిటర్స్ పరిశీలిస్తున్నట్లు విచారణ అధికారి వివరించారు.

● **బయట పడుతున్న రికార్డ్ అసిస్టెంట్ బాగోతం...**

జగిత్యాల వైద్యవిధాన పరిషత్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి డీఏ ఏరియర్స్, సీపీఎస్ ఏరియర్స్ నిధులు పక్కదారి పట్టించిన రికార్డు అసిస్టెంట్ యాసిన్ అవినీతి బాగోతం బుధవారం మరిన్ని వెలుగులోకి వచ్చాయి. జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో 11 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న బాబర్ అనే వ్యక్తిని నమ్మించి పర్సనల్ లోన్ ఇప్పిస్తానని చెప్పి ఐదు లక్షల రూపాయలు, థియేటర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న శివ గంగాధర్ అనే వ్యక్తి వద్ద పర్సనల్ లోన్ ఇప్పిస్తానని 15 లక్షల రూపాయలు తీసకుని మోసాలకు గురిచేసినట్లు బాధితులు విచారణ అధికారికి ఫిర్యాదు చేశారు. యాసిన్ నుంచి డబ్బులు రికవరీ చేయించాలని వేడుకున్నారు. ఇలా యాసిన్ బాగోతాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

-'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

కరీంనగర్ రూరల్, జూన్19: కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్‌లో వ్యవసాయానికి కొన్ని రోజులుగా విద్యుత్ సరఫరా లేక రైతులు ఇబ్బందిపడడంతో అధికారులు స్పందించి బుధవారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మొగ్దుంపూర్ గ్రామ శివారులో ఇటీవల కురిసిన గాలి వానకు విద్యుత్ స్తంభం కేబుల్ వైరుపై పడి విద్యుత్ సరఫరా నిలిచిపోయి నారుమడులు ఎండిపోయాయి. దీంతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో మంగళవారం 'విద్యుత్ శాఖ నిర్లక్ష్యంతో ఎండుతున్న నారుమడులు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వెంటనే విద్యుత్ అధికారులు డీఈ రాజం, ఏడీఈ కొలువుల రాజులు గ్రామంలో పర్యటించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో రైతులు ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు తెలిపారు.

'ఫ్లైయాష్ రవాణాలో అక్రమాలపై విచారణ జరిపించాలి'

కరీంనగర్ టౌన్, జూన్ 19: ఫ్లైయాష్ రవాణాలో అక్రమాలపై విచారణ జరిపించి చిత్తశుద్ధి చాటు కోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మేయర్ సునీల్‌రావు సవాల్ చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేకుండా జిల్లాతో సంబంధం లేని మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్ నగరపాలక సంస్థ అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఎలా సమీక్ష సమావేశాన్ని నిర్వహిస్తారని మేయర్ ప్రశ్నించారు. బుధవారం నగరంలో మీడియా సమావేశంలో మేయర్ మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంతానికి సంబంధించిన మంత్రి పొన్నం ప్రభాకర్ నగరపాలక సంస్థ సమీక్ష నిర్వహించడం దేనికి సంకేతమని మండిపడ్డారు. కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులను, ఎక్స్‌అఫిషియో సభ్యులైన స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, మేయర్‌కు ఆహ్వానించకుండా నగర పాలక సంస్థ అధికారులతో ఎలా సమీక్ష నిర్వహిస్తారని జిల్లా యంత్రాంగాన్ని ప్రశ్నించారు. అభివృద్ధి పనుల్లో అవినీతి ఆరోపణలపై విజిలెన్సు లేదా ఎలాంటి విచారణైనా చేసుకోవచ్చని, తప్పు చేస్తే తాము ఏ శిక్షకైనా సిద్ధమేనని మేయర్ సునీల్‌రావు స్పష్టం చేశారు. ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ఏనాడూ నగర అభివృద్ధిని అడ్డుకోలేదని, స్మార్ట్‌సిటీకి సహకరించారన్నారు. కేంద్ర మంత్రిగా నగర అభివృద్ధికి సహకరించాలని పాలకవర్గం పక్షాన కోరుతున్నామని మేయర్ అన్నారు. ఇప్పటికైనా మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను బెదిరించి నగరంలో అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నాలు మానుకోవాలని కోరారు. ఈ మీడియా సమావేశంలో కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

'అవినీతిపై విచారణ అనగానే మేయర్‌కు ముచ్చెమటలు'

కరీంనగర్ అర్బన్, జూన్ 19: నగర అభివృద్ధి పేరుతో అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టేది లేదని మంత్రి పొన్నం ప్రభాకర్ మున్సిపల్ సమీక్షా సమావేశంలో హెచ్చరించడంతో మేయర్ సునీల్‌రావుకు ముచ్చెమటలు పడుతున్నాయని జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి విమర్శించారు. డీసీసీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎంపీ నిధులు మినహా ఒక్క రూపాయి అదనంగా తీసుకురాలేదన్నారు. మేయర్ మాత్రం ఆయనను కొనియాడుతున్నారని విమర్శించారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ ఛైర్మన్ పులి ఆంజనేయులుగౌడ్, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్ పాల్గొన్నారు.

'మేయర్ అవినీతికి పాల్పడకపోతే విచారణ ఎదుర్కోవాలి'

కరీంనగర్ అర్బన్, జూన్ 19: కరీంనగర్ మేయర్ సునీల్‌రావు సచ్ఛీలుడైతే స్మార్ట్‌సిటీ పనులపై విచారణ ఎదుర్కోవాలని కాంగ్రెస్‌పార్టీ కార్పొరేటర్లు, నాయకులు సవాల్ విసిరారు. బుధవారం డీసీసీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై మేయర్ సునీల్‌రావు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. సమావేశంలో కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, గంట కళ్యాణి, నేతికుంట యాదయ్య, మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు కాశెట్టి లావణ్య శ్రీనివాస్, గంట శ్రీనివాస్, ఆకుల నర్మదా నర్సన్న, ఆకుల లత ప్రకాష్, మెండి శ్రీలత చంద్ర శేఖర్, పిట్టల వినోద శ్రీనివాస్, సరిల్ల ప్రసాద్, మాచర్ల ప్రసాద్, జక్కని ఉమాపతి, ఎండీ ఆరీఫ్, పడిశెట్టి భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

●కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతిపై మంత్రి పొన్నం ప్రభాకర్ విచారణకు ఆదేశిస్తే మేయర్ సునీల్‌రావుకు భయం పట్టుకుందని సుడా ఛైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. నగర కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం విలేరరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రులకు పరిధులు నిర్ణయించే స్థాయి మేయర్ సునీల్‌రావుకు లేదని అన్నారు. ఈ సమావేశంలో మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజోద్దిన్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అరుణ్‌కుమార్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రవణ్ నాయక్ పాల్గొన్నారు.

●సుభాష్‌నగర్, జూన్ 19: పొన్నం ప్రభాకర్ మంత్రిగా అధికారులతో సమీక్ష నిర్వహించారని ఈ విషయం కూడా మేయర్ సునీల్‌రావుకు తెలియపోవడం శోచనీయమని పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ అన్నారు. బుధవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సమావేశంలో నగర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ మోసిన్, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌హుస్సేన్ పాల్గొన్నారు.

'మట్టి అక్రమ దందాను నిలుపుదల చేయాలి'

కరీంనగర్ టౌన్, జూన్ 19: లోయర్ మానేరు డ్యాం నుంచి దళారులు, కాంట్రాక్టర్లు అక్రమంగా తరలిస్తున్న మట్టి దందాను తక్షణమే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బేతి మహేందర్‌రెడ్డి జిల్లా అధికార యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఎల్ఎండీ నుంచి దళారులు, కాంట్రాక్టర్ అక్రమంగా మట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు.

టేకుర్తి మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

ఇల్లందకుంట, జూన్ 19: ఇల్లందకుంట మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌లో 6,7,8,9,10వ తరగతితో పాటు ఇంటర్మీడియట్‌లోని ఎంపీసీ, బైపీసీ, సీఈసీలో ఉన్న సీట్లను భర్తీ చేయుటకు ఈ నెల 20 నుంచి 22 వరకు మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే 9,10వ తరగతి బాలికలకు ప్రత్యేక హాస్టల్ సౌకర్యం కల్పిస్తున్నామని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువత వ్యసనాలకు బానిసలు కావద్దు



మాట్లాడుతున్న ఏసీపీ

హుజూరాబాద్ రూరల్, జూన్ 19: యువత వ్యసనాలకు బానిసలు కావద్దని హుజూరాబాద్ ఏసీపీ శ్రీనివాస్‌జీ అన్నారు. బుధవారం హుజూరాబాద్ మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలోని విద్యార్థులకు పోలీసుల ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఒక విద్యార్థి కళాశాలలో తమ స్నేహితులను ఎంచుకునేటప్పుడు జాగ్రత్త వహించాలన్నారు. మత్తు మందులు, మత్తు పానీయాలు స్నేహితుల వలన అలవాటు అవుతాయన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకొచ్చి వారి ఆశయాలను నెరవేర్చాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య, కళాశాల విభాగాధిపతులు డాక్టర్ యోగేష్ పుండలిక్, డాక్టర్ రాజేంద్రప్రసాద్, సీఐలు బొల్లం రమేష్, పులి వెంకట్, రవి, ఎస్ఐలు ఆరోగ్యం, లక్ష్మారెడ్డి, తిరుపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే

శంకరపట్నం, జూన్ 19: మండలంలోని మొలంగూర్ గ్రామంలోని పెద్దమ్మతల్లి జాతరకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ మెంబర్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, నాంపల్లి తిరుపతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు

సైదాపూర్, జూన్ 19: వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా విద్యుత్ సిబ్బంది ఇప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని హుజూరాబాద్ డీఈ లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం సైదాపూర్ మండల కేంద్రంలో విద్యుత్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందేలా ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. వర్షాకాలంలో గాలుల వలన లైన్లు తెగిపడి, పోల్స్ విరిగి పడి ప్రమాదాలు జరగకుండా త్వరితగతిన పునరుద్ధరణ చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏడీఈ శ్రీనివాస్, ఏఈ ఆంజనేయులు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఉగ్రనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

శంకరపట్నం, జూన్ 19: శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు గుట్టపై శ్రీమహాలక్ష్మి సమేత ఉగ్రనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకుడు శేషం మురళీధరాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నిత్యారాధన, అష్టోత్తర శతనామార్చన, నిత్యహోమం, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, బలిహరణ, ద్వాదశి ఆరాధన, ఏకాంత సేవ తదితర కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ మల్లారెడ్డి, ఈవో సుధాకర్, డైరెక్టర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



కరీంనగర్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్‌లో పండ్లు పంపిణీ

కరీంనగర్ అర్బన్, జూన్ 19: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం కరీంనగర్ డీసీసీ కార్యాలయంతో పాటు నగరంలోని పలుచోట్ల వేడుకలను నిర్వహించారు. డీసీసీ కార్యాలయంలో మానకొండూరు ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఇందిరాచౌక్ వద్ద నిర్వహించిన కార్యక్రమానికి నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి హాజరై కేక్ కట్ చేశారు. మాజీ కార్పొరేటర్ పడిశెట్టి భూమయ్య ఆధ్వర్యంలో కోతిరాంపూర్‌లోని గిద్ద పెరుమాండ్ల దేవాలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నారెడ్డి పాల్గొన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు వైద్యుల శ్రీదేవి అంజన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో నగరంలోని సుభాష్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు.

●మైత్రి కన్వెన్షన్ వద్ద 25వ డివిజన్ కాంగ్రెస్ నాయకులు దీకొండ శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి కేక్ కట్ చేశారు. 18వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బాలబద్రి శోభారాణి శంకర్ ఆధ్వర్యంలో రేకుర్తి అంబేద్కర్ చౌరస్తా వద్ద కేక్ కట్ చేశారు.

●సిటీ కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు హైమద్ అలీ ఆధ్వర్యంలో కరీముల్లా షా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమానికి టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ఏ మోసిన్ హాజరయ్యారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు చర్ల పద్మ, పులి ఆంజనేయులుగౌడ్, శ్రావణ నాయక్, కర్ర సత్యప్రసన్న రెడ్డి, కొరివి అరుణ్ కుమార్, సిరాజు హుస్సేన్, వెన్నం రజిత, కుర్ర పోచయ్య పాల్గొన్నారు.

●జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పడాల రాహుల్ ఆధ్వర్యంలో ఆయుష్ బ్లడ్ బ్యాంకులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అట్లా అనిల్‌ముదిరాజ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు కృప సాగర్, కిమ్ ఫహద్, అరవింద్ పాల్గొన్నారు.

●కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేసిన అనుచరులు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కరీంనగర్ అమ్మఒడి ఫౌండేషన్ ద్వారా 100 మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో వెలిచాల రాజేందర్‌రావు యువసేన నాయకులు గుర్రాల రాజేశ్వర్‌రెడ్డి, కొండా పర్శరాములుగౌడ్, గుమ్మడి రమేష్, తఢ్కపల్లి రవీందర్ పాల్గొన్నారు.

●**హుజూరాబాద్:** పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ కేక్ కట్ చేశారు. అనంతరం ఏరియా ఆస్పత్రిలోని బాలింతలకు, రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు.

●**హుజూరాబాద్ రూరల్:** మండలంలోని కందుగులలో కేక్ కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిరణ్‌రెడ్డి, సమ్మిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, నూరుళ్ల, బలరాం, సమ్మయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

●**శంకరపట్నం/సైదాపూర్:** శంకరపట్నం, సైదాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.

●**ఇల్లందకుంట:** మండల కేంద్రంలో కాంగ్రెస్ పూత వంగ రామకృష్ణ ఆధ్వర్యంలో ఇల్లందకుంట సీతారామ చంద్రస్వామి దేవాలయంలో రాహుల్‌గాంధీ పేరుపై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

●**చొప్పదండి:** మండల కేంద్రంలో జరిగిన వేడుకల్లో మున్సిపల్ ఛైర్‌పర్సన్ గుర్రం నీరజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ముద్దం తిరుపతిగౌడ్, నాయకులు గుంటి స్వరూప, పెరుమాండ్ల గంగయ్య గౌడ్ పాల్గొన్నారు.

●**తిమ్మాపూర్:** నుస్తులాపూర్‌లో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మోరపల్లి రమణరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీటీసీ కొత్త తిరుపతి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎస్ఎల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

●**గంగాధర:** మండల కేంద్రంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మనోహర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

●**గన్నేరువరం:** మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముస్కు ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా కార్యదర్శి సునీల్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

●**చిగురుమామిడి:** మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్, నాయకులు చిట్టుమల్ల రవీందర్ పాల్గొన్నారు.

●**రామడుగు:** ఎంపీపీ జవాజి హరీష్ ఆధ్వర్యంలో మండలంలోని వెలిచాల ప్రశాంత భవనంలో స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌గౌడ్, కోల రమేశ్, ఎలుకపల్లి లచ్చయ్య, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

●**జమ్మికుంట:** పట్టణంలోని గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు.

●**వీణవంక:** మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ, హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ హాజరై కేక్ కట్ చేశారు. అనంతరం స్పందన ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 50 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎక్కటి రఘుపాల్ రెడ్డి, సాహెబ్ హుస్సేన్, నల్ల కొండాల్‌రెడ్డి, గంగాడి రాజిరెడ్డి, గూటం హరిప్రసాద్, గంగాడి తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్, అనీమియాపై అవగాహన

సుభాష్‌నగర్, జూన్ 19: జిల్లా కేంద్రంలోని బుట్టి రాజారాం కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుదవారం సికిల్‌సెల్, అనీమియాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత హాజరై మాట్లాడారు. సికిల్‌సెల్ వ్యాధి పుట్టినప్పటి నుంచి ఉంటుందన్నారు. జన్యులోపం కారణంగా సికిల్‌సెల్ వ్యాధి సంభవి స్తుందన్నారు. కార్యక్రమంలో ఎంసీహెచ్ పీవో డాక్టర్ సనాజవేరియా, బుట్టి రాజారాం కాలనీ అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులను రక్షించిన జాలరికి సన్మానం

కరీంనగర్ టౌన్, జూన్ 19: లోయర్ మానేరు డ్యాం కెనాల్ రెగ్యులేటర్ వద్ద రెండు రోజుల క్రితం ప్రమాదవశాత్తు నీటిలో పడిన ఇద్దరు చిన్నారులను రక్షించిన జాలరి కొత్తూరు శంకర్‌ను మేయర్ యాదగిరి సునీల్‌రావు సన్మానించారు. బుధవారం స్థానిక 8వ డివిజన్ కార్పొరేటర్ సల్ల శారద రవీందర్‌తో కలిసి కొత్తూరి శంకర్‌ను శాలువతో సత్కరించారు.

జాబ్ మేళాను వినియోగించుకోవాలి

చిగురుమామిడి, జూన్ 19: రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరుద్యోగ మేళాను విద్యార్థులు వినియోగించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతిరెడ్డి, జడ్పీ ఫ్లోర్ లీడర్ గీకురు రవీందర్ సూచించారు. బుధవా రం మండల కేంద్రంలో నిరుద్యోగ జాబ్ మేళా పోస్టర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ ఈనెల 24 నుంచి హుస్నాబాద్ పట్టణంలోని తిరుమల గార్డెన్‌లో జాబ్ మేళ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హతలు ఉన్న నిరుద్యోగులందరూ హాజరై ఉద్యోగాల్లో స్థిరపడాలని సూచించారు.

రెస్టారెంట్లలో ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

కరీంనగర్ క్రైం, జూన్ 19 : కరీంనగర్‌లో ఫుడ్‌సేఫ్టీ, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం పలు రెస్టారెంట్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ సునీత, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీ శ్రీనివాసరావుల ఆధ్వర్యంలో కేఎఫ్‌సీ, అరేబియన్ మండి రెస్టారెంట్, మహారాజా బార్ అండ్ రెస్టారెంట్‌లను తనిఖీలు చేశారు. ఈ తనిఖీలో భాగంగా కొన్ని అనుమానిత నమూనాలు సేకరించి ల్యాబ్‌కి పంపించారు. కొన్ని నిల్వ చేసిన ఆహార పదార్థాలను పారవేశారు. పరిశుభ్రత లేని కారణంగా రెస్టారెంట్, హోటల్ నిర్వాహకులకు నోటీసులను జారి చేశారు. ఇకనుంచి ఆహార వ్యాపార నిర్వాహకులు సరైన పరిశుభ్రత ప్రమాణాలు పాటించపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి


మార్కెట్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, జూన్ 19: నగరంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మేయర్ సునీల్‌రావు అధికారులను ఆదేశించారు. బుధ వారం ఆయన 54వ డివిజన్ పరిధిలోని కశ్మీరుగడ్డ రైతుబజార్ ప్రాంతంలో రూ.10 కోట్లతో నిర్మించ తలపెట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను వేగంగా పూర్తిచేయాలని అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కశ్మీరుగడ్డ రైతుబజార్‌కు ప్రజాదరణ పెరుగడంతో అత్యాధునిక హంగులతో అన్ని రకాల సౌకర్యాలతో నగరపాలక సంస్థ నిధులు 10 కోట్లతో ఇక్కడ సమీకృత మార్కెట్‌ను నిర్మిస్తున్నామని చెప్పారు. ఆరు నెలల్లో మార్కెట్ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు అఖీనా, తుల శ్రీదేవి చంద్రమౌళి, దిండిగాల మహేశ్, గుగ్గిళ్ళ జయశ్రీశ్రీనివాస్, గందె మాధవి మహేశ్, ఎడ్ల సరిత అశోక్, తోట రాములు, వాల రమణారావు, జంగిలి ఐలేందర్‌యాదవ్, కుర్ర తిరుపతి, కచ్చు రవి తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యలపై నిలదీత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి

సైదాపూర్, జూన్ 19: సైదాపూర్ మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం బుధవారం జరగగా సభ్యులు సమస్యలపై నిలదీశారు. ఈ సందర్భంగా మండలాధికారులు తమతమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. వెన్కేపల్లి ఎంపీటీసీ జంపాల సంతోష్ మాట్లాడుతూ 14 నెలలుగా టీఎం 33 సమస్య పరిష్కారం కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగిన పనికావడం లేదని తహసీల్దార్ మంజులను ప్రశ్నించారు. కలెక్టర్ నుంచి ఆదేశాలు లేవని, సమస్యలు పరిష్కారం చేయడం లేదన్నారు. అనంతరం సైదాపూర్ మండలానికి చెందిన మహాత్మా జ్యోతిరావుపూలే పాఠశాల హుజూరాబాద్‌లో నిర్వహిస్తున్నారని, పాఠశాలను సైదాపూర్ మండలంలో నిర్వహించేందుకు సభలో తీర్మానం చేశారు. అలాగే మండల పరిషత్, ఐకేపీ, ఉపాధి హామీ భవనాల మరమ్మతుల నిర్మాణానికి నిధుల మంజూరుకు తీర్మానం చేశారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని తీర్మానం చేశారు. సమావేశంలో తహసీల్దార్ మంజుల, ఎంపీడీవో యాదగిరి, వైద్యాధికారి సౌమ్య, ఏవో వైదేహి, పీఆర్‌ఏఈ యాదగిరి, ఎంఈవో నర్సింహారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి బండి సంజయ్‌కి సన్మానం

భగత్‌నగర్, జూన్ 19: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు చేపట్టి తొలిసారి కరీంనగర్ వచ్చిన సందర్భంగా జిల్లా బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడికృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, ప్రధాన కార్యదర్శులు తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, మాడ వెంకటరెడ్డి, బత్తుల లక్ష్మీనారాయణ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, గాజె రమేష్ గజమాలతో సత్కరించారు.

తిమ్మాపూర్: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా బుధవారం కరీంనగర్‌కు విచ్చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు తిమ్మాపూర్ మండల బీజేపీ శాఖ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బండి సంజయ్‌కు పూల బోకేతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు సుగుర్తి జగదీశ్వ రాచారి, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడ్డం అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

రామడుగు: కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించి మొదటిసారి రామడుగు మండలం దేశ్‌రాజ్‌పల్లి గ్రామం మీదుగా వెళ్తుండగా బీజేపీ నాయకులు గజమాలతో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్‌యాదవ్, మండలశాఖ అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ఉప్పు రామ్‌కిషన్, తిరుమలాపూర్ ఎంపీటీసీ సభ్యులు మోదీ రవీందర్, జిల్లా కార్యవర్గసభ్యులు పొన్నం శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

గంగాధర: కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు గంగాధరలో బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టి మొదటిసారిగా గంగాధర మీదుగా కొండగట్టు ఆంజనేయ స్వామి దర్శనానికి వెల్లుతున్న బండి సంజయ్ కుమార్‌కు గంగాదర ప్రధాన రహదారిపై బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. మంత్రిని సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెరుక శ్రవణ్‌కుమార్, రేండ్ల శ్రీనివాస్, అశోక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రీ స్కూల్ ఆక్టివిటీస్‌పై ఓరియంటేషన్ ప్రోగ్రాం


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీవో శ్రీధర్

తిమ్మాపూర్, జూన్ 19: మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల దుర్గాబాయి మహిళ శిశు వికాస కేంద్రంలో కరీంనగర్ రూరల్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ప్రీస్కూల్ అక్టివిటీస్‌పై అంగన్‌వా డీ టీచర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీవో శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రీ స్కూల్‌కి సంబంధించి ప్రియదర్శిని, పూర్వప్రాథమిక విద్యా కరదీపికలోని అంశాలపై సరైన పద్ధతిలో శిక్షణ జరగాలని సూచించారు. ఈ శిక్షణ జూన్ 19వ తేదీ నుంచి ఆగస్టు 10 వరకు కొనసాగుతాయని అన్నారు. దీనికి సంబంధించి ట్రైనర్స్ పూర్తి స్థాయిలో అన్ని అంశాలపై శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ స్కూల్‌లో అభ్యసించే పిల్లలకు ప్రీ స్కూల్ అక్టివిటీస్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, డీడబ్ల్యూవో సరస్వతి, సీడీపీవో సబిత, ఏసీడీపీవో, సూపర్‌వైజర్లు, పోషణ అభియాన్ సిబ్బంది, నియోజకవర్గంలోని ఐదు మండలాల అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శ్రీచైతన్య ఫార్మసీ కాలేజీలో ఫేర్‌వెల్ డే



విద్యార్థినికి మెమోంటో అందజేస్తున్న రమేష్‌రెడ్డి

తిమ్మాపూర్, జూన్ 19: స్థానిక శ్రీచైతన్య ఫార్మసీ కళాశాలలో బీఫార్మసీ చివరి సంవత్సరం ముగించుకున్న విద్యార్థులకు మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఘనంగా వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీచైతన్య విద్యా సంస్థల ఛైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించి, తల్లిదండ్రులకు, కళాశాలకు మంచి పేరు తీసుకు రావాలని అకాంక్షించారు. అనంతరం పీజీఈసెట్-2024లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, యూనివర్సిటీ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ఛైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి బహుమతులు, మెమెం టోలు అందజేశారు. అనంతరం విద్యార్థులు ఆటాపాటలతో అలరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ కె నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామ నర్సింహారెడ్డి, హెచ్ఓడిలు రవీందర్, ధనుంజయ్, చంద్రమౌళి, రాంప్రసాద్, అధ్యాప కులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోస్త్ రెండో విడత సీట్ల కేటాయింపు

గణేశ్‌నగర్, జూన్ 19: శాతవాహన విశ్వవిద్యాలయంలో దోస్త్ రెండో విడుత సీట్ల కేటాయింపు పూర్తి అయినట్లు ఎస్‌యూ దోస్త్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ సూరపల్లి సుజాత తెలిపారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో దోస్త్ రెండో విడత సీట్లలో ఉన్నత విద్యా మండలి శాతవాహన యూనివర్సిటీ పరిధిలో మొత్తం 2,743 సీట్లను కేటాయించింది. రెండో విడతలో సీట్లు పొందిన విద్యార్థులు 26వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని దోస్త్ కోఆర్డినేటర్ తెలిపారు.

పీజీ ఈసెట్‌లో శాతవాహన విద్యార్థుల ప్రతిభ

గణేశ్‌నగర్, జూన్19: యం.ఫార్మసీ ప్రవేశాల కోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పీజీ ఈసెట్ ఎంట్రన్స్‌లో శాతవాహన విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీశైలం తెలిపారు. ఈ పరీక్షలో జి.నందిని 6వ ర్యాంకు, యం సాయికిరణ్ 26, ఏ రమ్య 29, జి ప్రత్యూష 46, శివాని 54, పల్లవి63, వై స్నేహ 67, ఎం ప్రవళిక 75, బి హరీష్ 108, పి సౌమ్య 128, పి సాయి పూజిత 148, ఏ లోకేశ్ 165, జి స్రవంతి 174 ఎస్ జగదీష్ 183, ఎం భానుమతి 191, డి మేఘన 208, ఎం హరిణి 228, కె శివరాములు 231, ఎల్ ప్రణతి 272, సంధ్యారాణి 284, ఎస్ ఆదిత్య 328వ ర్యాంకు సాధించినట్లు ఆయన తెలిపారు.

పాఠశాలల్లో వసతులు కల్పించాలి

భగత్‌నగర్, జూన్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో మౌళిక వసతులు కల్పించాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాంపెల్లి అరవింద్, గజ్జెల శ్రీకాంత్, తిప్పారపు రోహిత్ పాల్గొన్నారు.

మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడిగా సదానందం

కరీంనగర్ టౌన్, జూన్ 19: జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా అధ్యక్షుడిగా తలకొక్కుల సదానందం నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు బద్దీపడుగ శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిటీ జాతీయ అధ్యక్షుడు మహ్మద్ యాసిన్ ఆదేశాల మేరకు సదానందంను నియమించినట్లు పేర్కొన్నారు.

పేదలకు అన్నదానం

కరీంనగర్ టౌన్, జూన్ 19: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా కరీంనగర్‌కు వచ్చిన సందర్భంగా టవర్‌సర్కిల్‌లో పేదలకు అన్నదానం చేశారు. నగరంలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో బండి సంజయ్ కుమార్‌తో కలిసి చదివిన పూర్వ విద్యార్థులు, చిన్ననాటి స్నేహితులు బీజేపీ నాయకుడు తొడుపునూరి కరుణాకర్ ఆధ్వర్యంలో అన్నదానం చేసి సంబురాలు జరుపుకున్నారు.

ముగిసిన అధ్యయనోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జూన్ 19: నగరంలోని జ్యోతీనగర్ లక్ష్మీ గోదా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా అధ్యయనోత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిసాయి. నమ్మాళ్వార్ పరమపదోత్సవాన్ని శ్రీవైష్ణవ ద్విజులు ద్రవిడ ప్రబంధ పారాయణంతో శాస్త్రోక్తంగా ముగించారు. కార్యక్రమంలో ప్రధానార్చకుడు దీవి కృష్ణకిషోర్‌తో పాటు కాండూరి వేంకటాచార్యులు, తిర్వరంగం భరద్వాజ్, డెబ్బట శ్రీధరాచార్యులు పాల్గొన్నారు. 26 నుంచి జూలై 1వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.

అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలి

భగత్‌నగర్, జూన్ 19: జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరుతూ పిడిఎస్‌యు ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ఏవో సుధాకర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు రత్నం రమేష్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, పాఠశాలలు, కళాశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించకుండా విద్యాసంస్థల్ని నడుపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులురాకేష్, సందీప్, నవీన్, శ్రీకాంత్, సృజన్, తదితరులుపాల్గొన్నారు.

కేంద్ర హోంశాఖ సహాయమంత్రిని కలిసిన టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, జూన్19: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్ట మొదటిసారిగా కరీంనగర్‌కు చేరుకున్న బండి సంజయ్‌కుమార్‌ను కరీంనగర్ జిల్లా టీఎన్‌జీఓ నాయకులు కలిసిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు ఆవుదూడ బొమ్మను బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావు, కోశాధికారి కిరణ్ కుమార్‌రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు నాగుల నర్సింహస్వామి, హరికృష్ణ, ప్రభాకర్‌రెడ్డి, రాగి శ్రీనివాస్, అర్బన్ అధ్యక్షుడు సర్దార్ హర్మిందర్‌సింగ్, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, రవీందర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, రమేష్‌గౌడ్, పవన్‌కుమార్, సబిత, సునీత, సరిత, రాధిక, విజయలక్ష్మీ, హరిప్రియ, శైలజ, సుశ్మిత పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఘన సన్మానం

గన్నేరువరం, జూన్ 19: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులు టేకు రాధిక, పాశం రాజును బుధవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఒక్కో విద్యార్థికి మూడు వేల రూపాయల చొప్పున నగదు పారితోషికాన్ని అందజేసి వారిని అభినందించారు. విద్యార్థులు పట్టుదలతో చదివి మండలానికి మంచి పేరును తేవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామయ్య, ఉపాధ్యాయులు నరేందర్, రామానుజన్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఉపకార వేతనాలకు ఎంపిక

చొప్పదండి, జూన్ 19: మండలంలోని రుక్మాపూర్ మోడల్‌స్కూల్ విద్యార్థి జాతీయ ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ కోల రమేష్ తెలిపారు. స్కూల్‌కు చెందిన అమరగాని సాయి స్నేహిత, అనంపల్లి గౌతం, పెరుమాండ్ల స్ఫూర్తి, గజ్జెల కీర్తనలు ఈ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యారు. 12వ తరగతి వరకు వీరికి 48వేల రూపాయల వరకు ఉపకార వేతనాలు అందుతాయని తెలిపారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు

కరీంనగర్ కల్చరల్, జూన్19: నగరంలోని మంకమ్మతోట వేంకటేశ్వర స్వామి ఆలయ 14వ బ్రహ్మోత్సవాలను శుక్రవారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్ శ్రీనివాస్, వ్యవస్థాపక వంశీయ ధర్మకర్త పి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళల క్రీడా పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జూన్ 19: జిల్లా కేంద్రంలోని వాగ్దేవి వనిత క్లబ్ మహిళల క్రీడా పోటీలకు స్పందన లభించింది. బుదవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో వాగ్దేవి వనిత క్లబ్ మహిళలకు షటిల్ బ్యాట్‌మెంటెన్, చదరంగ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన మహిళలను రీజినల్ క్రీడలకు ఎంపిక చేశారు. కాగా అధిక సంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ చాటారు. జోనల్ పోటీల్లో పాల్గొనేందుకు షటిల్, చదరంగం క్రీడాంశాలకు ఎం స్వరూప, మాడిశెట్టి ఉమాదేవి, హరిణి, విశాల ఎంపికయ్యారు.